ఊళ్ళో డప్పులమోత మరింత ఎక్కువైంది. ఆ శబ్దం మెల్ల మెల్లగా కొందరి చెవులకు దూరమౌతున్నది. మరికొందరి చెవులకి దగ్గరౌతోంది. ఆ చప్పుళ్ళ మధ్య జన సమూహం మెల్ల మెల్లగా ఊళ్ళోని కూడలి వద్దకు కదుల్తోంది.

అనుకోకుండా తలెత్తి ఆకాశం వైపు చూశాడు కోటిరెడ్డి. సమయం సాయంత్రం నాలుగు గంటలు కావొస్తోంది. వర్షాకాలం కాకపోయినా ఆరోజు మధ్యాహ్నం నుంచీ ఆకాశం మబ్బుగా వుంది. కానీ ఒక్క చినుకు కూడా పడలేదు. అసలా రోజు వాతావరణమే చాలా అసహజంగా, అనీజీగా వుంది. తుఫాన్ ముందరి ప్రశాంతత లాంటిది అక్కడ నెలకొని వుంది. కారణం ఏమిటో ఎవ్వరూ చెప్పలేక పోతున్నారు. కానీ ప్రతివారి మనస్సుల్లోనూ ఏదో అలజడి, అశాంతి... ...

# అగ్ని గుండం

ఆర్. కృష్ణప్రసాద్



కేశవరం మహబూబ్‌నగర్ జిల్లాలోని ఒక పల్లెటూరు. ఈ రాష్ట్రంలో వెనుకబడ్డ ప్రాంతం తెలంగాణా అయితే, అందులో మరీ వెనుకబడ్డ జిల్లా మహబూబ్‌నగర్. దానికి కారణం అక్కడి ప్రజల మనస్తత్వం, జీవన సరళి కావచ్చు, రాజధానితోగాని ఇతర నగరాలతోగాని సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడం కావచ్చు, పాలకుల రాజకీయాలు కావచ్చు, నీటి పారుదల సౌకర్యాలు లేకపోవడం కావచ్చు, మరేదైనాకావచ్చు.

ఆ ఊరి జనాభా ఐదువేలకి మించదు. అందులో బాగా జరుగుబాటు వున్న కుటుంబాలు పది పది హేనుకి మించవు. ఆ ఊరికింది పొలాలన్నీ పది రెడ్డి కుటుంబాలకి చెందినవి. ఊళ్ళో అయ్యవారూ (పూజారి), పట్వారీ, ఇంకో రెండు మూడు వైశ్య కుటుంబాలూ – వీళ్ళే కాస్త వున్నవాళ్ళు. తక్కిన జనమంతా రెక్కాడితేగాని డొక్కాడని వాళ్ళే. పొలాల్లో కూలిపని చేసేవాళ్ళు, మగ్గం నేసేవాళ్ళూ, బుట్టలు అల్లేవాళ్ళూ, కమ్మర్లూ, కుమ్మర్లూ, వడ్రంగులూ, దర్జీలూ, ఇలా ఆ చిన్న ఊళ్ళో దాదాపు అన్ని వృత్తుల వాళ్ళూ వున్నారు.

కోటిరెడ్డి ఆ ఊళ్ళోని మోతుబరి రైతుల్లో ఒకడు. అతనికి సుమారు నలభై ఏళ్ళుంటాయి. అతనికి ఇరవై ఎకరాల పొలం వుంది. స్వంత

ట్రాక్టర్ వుంది. దిగుడు బావీ వుంది. ఈ మధ్యవే మోటార్ కూడా పెట్టించాడు. కూలివాళ్ళకిచ్చే తిండి గింజలు పోను కనీసం రెండు వందల బస్తాల ధాన్యమైనా మిగులుతుంది. అదికాక రెండో పంట కింద కందులూ, రాగులూ ఏదో ఒకటి వేస్తూనే వుంటాడు. అంతా పోను సంవత్సరానికి ఓ ఇరవై. వేలన్నా నికరం,గా మిగుల్తాయి. అయితే ఏం? అతని మనసుకి సంతృప్తిలేదు, శాంతి లేదు. ఇంకా ఇంకా డబ్బు సంపాదించాలనే ఆరాటం? పట్నంలో ఇల్లు కట్టించాలి. తన పొలం పక్క వున్న అమీన్ బాషా పొలం కొనెయ్యాలి. భార్యకి నగలు చేయించాలి. లారీఒకటి కొనాలనుకుంటున్నాడు తాను. కొంటే దాని మీద కూడా సంపాదించవచ్చు. వీటన్నిటికీ కావాలి డబ్బు! డబ్బు! డబ్బు! పైసలు! పైసలు! పైసలు!!

కూలీలకు తిండి గింజలు కొలవడం దగ్గర్నుంచీ, ప్రతిచిన్న విషయంలోనూ అతను తన లోభగుణం చూపెట్టు కుంటాడు. పాపం! కూలీ లేమిచేస్తారు? ఇచ్చే వరకూ కాళ్ళు పట్టుకుని బ్రతిమాలుతారు.

కోటిరెడ్డికి ఇప్పడొక కొత్త సమస్య పట్టుకుంది ఈ సంవత్సరం ఎరువులు కొనడానికి చేతిలో డబ్బు లేదు. ప్రభుత్వం వారు ఇస్తామన్న ఋణం ఏదో కారణాలవల్ల ఆగిపోయింది. బ్యాంకులలో కావలసినంత డబ్బు వుంది గానీ, అమ్మో!తాను తియ్యడు. బ్యాంకులో డబ్బు వెయ్యడమే గానీ తియ్యడం అలవాటు లేదు తనకి. కనీసం లక్ష రూపాయలైనా పోగయ్యేంత వరకూ తియ్యకూడదని అనుకున్నాడు. కానీ ఇప్పడు ఎరువులు కొనకపోతే పంట నాశనమౌతుంది. కనీసం నాలుగు వేలైనా కావాలి. ఎలా! ఎవరు సర్దుతారు?

కోటిరెడ్డి ఆలోచిస్తూ పొలంలో నడుస్తున్నాడు. కాలికింద ఏదో తగిలింది. చటుక్కున వంగి చూశాడు. బోదురు కప్ప! తన సహజ క్రౌర్య గుణంతో. దాన్ని చంపి వెయ్యబోయాడు. కానీ కప్పలు పొలాల్లోని పురుగుల్ని తింటాయనే సంగతి గుర్తుకి వచ్చింది. విసురుగా దాన్ని పొలంలోకి గిరావాటేసి, ఊళ్ళోకి వచ్చాడు.

దారిలో ఎదురైన జనం కొందరు దణ్ణాలు పెడుతున్నారు. కొందరు పక్కకి తొలుగుతున్నారు. కానీ, రెడ్డి అవేవీ పట్టించుకునే స్థితిలో లేడు. దూరం నుండి సైకిల్ మీద ఎవరో వస్తున్నట్టు కనిపించింది. రెడ్డి పరకాయించి చూశాడు. అతను గవళ్ళోళ్ళ పోచయ్య! ఇది వరకు మగ్గం నేసుకునేవాడు. ఈ మధ్య ప్రభుత్వం వారు ఓ రెండెకరాల బంజరు భూమి ఇప్పిస్తే వ్యవసాయం చేసుకుంటున్నాడు. పిల్లా జెల్లా లేరు. ఈ రెండేళ్ళలో ఒక పదివేలు వెనకేశాడని కూడా చెప్పకుంటున్నారు.

కోటిరెడ్డి తలలో ఒక ఆలోచన మెరిసింది. తనక్కావాల్సిన డబ్బు పోచయ్యనే అప్పగా అడిగి తీసుకుంటే! ఛీ ఛీ! తనంతటి వాడు గవళ్ళోళ్ళ పోచయ్య దగ్గర అప్ప తీసుకోవడమా! తన పరువూ, తన కులం వారి పరువూ ఏమైపోవాలి? అనుకున్నాడు మళ్ళీ. కానీ, మరోదారి ఏదీ కనపట్టం లేదే! సాటిరైతుల్ని అప్ప అడిగితే తన స్థితిగతులు తెలుసుగనక ఎద్దేవా చేస్తారు. అంతేకాక, ఇచ్చిన మ:ర్నాటినుంచీ వెంట పడతారు తీర్చమని. కానీ పోచయ్య లాంటివాడైతే నోరెత్తడు. ఈ సంగతి పదుగురికీ చెప్పకుండా తాను జాగ్రత్త తీసుకుంటాడు. అంతే! పోచయ్య దగ్గర బదులు తీసుకోడమే సరైన పద్ధతి! పంట చేతికి రాగానే తీర్చెయ్య వచ్చు.

పోఛయ్య సమీపించేలోగా కోటిరెడ్డి ఒక నిర్ణయానికి వచ్చాడు. అతడు దగ్గరకు రాగానే "ఏం పోచయ్యా! అంతా మంచిగనేనా?" అన్నాడు.


పోచయ్య సైకిల్ దిగి, దండంపెట్టి 'ఆ మంచిగనే వున్నా పెద్దరెడ్డీ' అన్నాడు.

"జా గానీ పోచయ్యా! జర సాయంత్రం ఓసారి పొలంలోకి వస్తావా? మాట్లాడేదుంది"

"గట్లనే! శామ్ (సాయంత్రం) అయినంక వస్తా" అని చెప్పి సైకిలెక్కి వెళ్ళి పోయాడు పోచయ్య. రెడ్డి అప్పడప్పడు అతనితో తాజాగా తీసిన తాటికల్లు తెప్పించుకుంటూ వుంటాడు. అందుకే కాబోలు ననుకున్నాడు పోచయ్య.

సాయంకాలం పోచయ్య రాగానే విషయం కదిపాడు రెడ్డి.

"ఒక్క నాలుగు వేలు వుంటే ఈరాదు 'పోచయ్యా! పంట రాగానే ఇచ్చేస్తా" అన్నాడు.



పోచయ్య తన చెవులను తానే నమ్మలేక పోయాడు. పెద్దరెడ్డి అంతటివాడు తనని అప్ప అడుగుతున్నాడు. తన స్థితికి తాను గర్వించాలో లేక రెడ్డి అవస్థకు జాలిపడాలో అర్థం కాలేదు అతనికి.

"మంచోనివే తియ్ రెడ్డీ! నీకు అప్ప పెట్టేంతోణ్ణి నాను నేను?" అన్నాడు.

"లే పోచయ్యా! బాంక్‌ల డబ్బున్నది గానీ, గదంతా ఫిక్సెడ్ జేసినా! గిప్పడు దీస్తే, చానా లుక్‌సాన్.అయితది. లేకుంటె నిన్నెందుకడ్గుతా" అన్నాడు.

"అప్ప అంటే ఊరికే వద్దులే! నూటికి పది రూపాయలెక్కన వడ్డీ ఇస్తా"

వడ్డీ అనగానే పోచయ్య మనసులో ఆశ రేకెత్తింది. తన దగ్గర ఓ పది వేలు వున్నమాట నిజమే. ఆ డబ్బు వృధాగా పడి వుండటం కంటే నూటికి పది రూపాయిల్లెక్కన వడ్డీ సంపాదించడం చాలా నయం. ఐనా... ఇంకే సందేహిస్తున్నాడు. రెడ్డి అంతటివాడికి తననిమోసం చేసే అవసరం లేదు. కానీ... చెమటోడ్చి సంపాదించిన డబ్బు కదా... సందేహిస్తున్నాడు.

పోచయ్య మాట్లాడకపోయేటప్పటికి రెడ్డి మళ్ళీ "నీకు గంత షక్ (అనుమానం) వుంటే, నాపొలం గిరిలి పెట్టుకో, అప్ప తీర్చేదంక" అన్నాడు. "రెండు నెల్ల వడ్డీ ముందుగాలే ఇచ్చేస్తా"

పోచయ్య మళ్ళీ ఆలోచించాడు.ఏ మాత్రం శ్రమలేకుండా ఏడెనిమిది వందలు వడ్డీ క్రింద వస్తాయి. రెడ్డి అంతటి వాడికి తనని మోసం చేసే అగత్యం లేదు. ఏదేమైనా తాను కాయితాల మీద అన్నీ జాగ్రత్తగా రాయించుకుంటాడు. రెడ్డి మళ్ళీ బ్రతిమిలాడాడు. ఈ సారి కాస్త నిష్టూరంగా...

"గట్లనే తియరెడ్డి! నీ అసువంటోడు అడిగితే మేమెట్ల కాదనాల?" అన్నాడు పోచయ్య. "అయితే కాయితాలు మట్టుకు రాపించుకుందాం. ఇద్దరికీ మంచిది"

"గీ సంగతి ఊళ్ళో ఎవనికి జెప్పకు పోచయ్యా! నా ఇజ్జత్ ఖరాబైతది" వేడుకున్నాడు రెడ్డి.

"లేలే! నాకేం. పని చెప్పనికి"

మరునాడు పట్వారీ దగ్గర దస్తావేజులు రాయించుకుని, నాలుగు వేలూ ఇచ్చాడు పోచయ్య. అన్న ప్రకారమే పొలం తాకట్టుపెట్టి, రెండు నెలల వడ్డీ కూడా ముందుగానే ఇచ్చాడు రెడ్డి.

* * * * *

ఆరు నెలలు గడిచి పోయాయి. రెడ్డి పొలం మునుపటి కంటే బాగా పండింది. కొత్త ట్రాక్టర్

కూడా కొన్నాడు. బ్యాంకులో నిల్వ మరికాస్త పెరిగింది. కానీ పోచయ్య అప్పు తీర్చాలంటేనే అతనికి ఎంతో కంటకంగా వుంది. అప్పటికి వడ్డీ ఇచ్చి కూడా నాలుగు నెలలైంది. అప్పటికే పోచయ్యే చేత చాలా సార్లు అడిగించుకున్నాడు రెడ్డి. చాలా నిష్ఠూరంగా "గిట్ల చేస్తవనుకోలేదు రెడ్డీ!" అన్నాడు పోచయ్య. వడ్డీ ఇవ్వకపోతేమానె. అసలైనా ఇచ్చెయ్యమన్నాడు. రెడ్డి ఉలకడు, పలకడు. ఏదో ఒక సాకు చెప్తాడు, చేతిలో డబ్బు లేదంటాడు, రేపురా మాపురా అని దిప్పతున్నాడు. అతనిలోని కరడు గట్టిన లోభగుణం మానవత్వాన్నీ, నీతినీ కప్పివేసింది. నిజానికి అతడికి డబ్బు ఇవ్వడం ఇష్టం లేదు. డబ్బు తీసుకునేప్పడు కూడా మళ్ళీ ఇవ్వాల్సి వస్తుందేమో అన్న విషయం ఆలోచించలేదతను.

పోచయ్య విసిగిపోయాడు. ఆ రోజు సాయంత్రమే రెడ్డి ఇంటికి వచ్చి నానా మాటలూ అని వెళ్ళాడు. ప్రతి ఆదివారం నాడూ చుక్క వేసుకోవడం పోచయ్యకు అలవాటు. వేసుకున్నాక తాను ఏం మాట్లాడుతున్నదీ, ఏం చేస్తున్నదీ అతనికి తెలియదు. ఆ రోజు కూడా అదే జరిగింది. బాగా తాగి వచ్చిన పోచయ్య రెడ్డిని పట్టుకుని నానా దుర్భాషలూ ఆడాడు. ఆ రోజే ఊరినించీ రెడ్డి బంధువులు వచ్చి అక్కడ వున్నారు. వాళ్ళందరి ముందూ గొడవెందుకని నచ్చ చెప్పబోయాడు రెడ్డి. కానీ పోచయ్య మైకంతో అవేవీ పట్టించుకునే స్థితిలో లేడు. "రేపు ఆదివారం నాటికి నా పైసలు ఇచ్చినవా, మంచిది! లేకుంటే ఊర్ల పంచాయతీ పెట్టించాల్సి వస్తది" అని చెప్పి వెళ్ళిపోయాడు పోచయ్య. రెడ్డి తన బంధువుల ముందు జరిగిన అవమానానికి భగ్గున మండి పోయాడు.

రెడ్డి పక్కమీద దొర్లుతున్నాడు. అతనికి నిద్ర పట్టడం లేదు. ఆదివారం నాటికల్లా డబ్బు ఇచ్చెయ్యాలని ఖండితంగా చెప్పి వెళ్ళిందు పోచయ్య. ఒక్క క్షణం, ఒకే క్షణం అతనికి అనిపించింది 'పోనీ ఇచ్చేద్దామా' అని, కానీ వెంటనే 'అమ్మో' అనుకుని గుండెల మీద చెయ్యి వేసుకున్నాడు. రెడ్డి ప్రాణాలైనా వదుల్తాడు కానీ పైసలు మాత్రం వదల్లేడు. ఒకటి కాదు, రెండు కాదు, నాలుగు వేలు! ఎందుకిస్తాడు తాను? అసలు ఆ కొంచెం వడ్డీ డబ్బు ఇచ్చినందుకే ఎంతో బాధపడిపోతున్నాడు. ఏమైనా కానీ, తాను ఇవ్వడు. ఒక్క పైసా కూడా ఇవ్వడు. పోచయ్యని ఏమైనా చేసుకోనీ, కానీ, 'నిజంగానే పంచాయతీ పెడ్తాడేమో" రెడ్డి కణతలు నొక్కుకున్నాడు. "ఆ పోచయ్యగాడు సచ్చిపోయినా బాగుండు! గీ పీడ వొదలిపోతుండె" అనుకున్నాడు కసిగా.

యథాలాపంగా అనుకున్న ఈ మాట మెల్లిమెల్లిగా రెడ్డిలో ఒక స్థిరమైన ఆలోచనగా మారింది. అతనిలోని పరిమలోభి. క్రౌర్యాన్ని గూడా సంతరించుకున్నాడు.

"అవును! ఆ పోచయ్యగాడు సచ్చిపోవాల. అప్పుడుగానీ తనకీ బాధ పోదు" అనుకున్నాడు మళ్ళీ. ఈ ఆలోచన రాగానే అతని వళ్ళు జలదరించింది. తాను తన చేతుల్తో ఏ మనిషినీ చంపలేదు. చంపలేదు. అంతస్థాయికి తనక్రౌర్యం ఇంకా ఎదగలేదు. "కానీ ఏదేమైన ఆ పోచయ్యగాడు చావాలన్నది నిజం! అది నిజమయ్యేటట్లు తాను చేస్తాడు. ఎలాగైనా సరే" రెడ్డిలోని రాక్షసుడు ప్రకోపించాడు.

"బాడఖావ్! పాలోళ్ళలో నా ఇజ్జత్ దీసినవ్లే! పంచాయతీ పెడ్తావు? సూస్తా!" బుసకొట్టాడు రెడ్డి.

నిద్రపట్టేలోపుగానే అతడొక నిశ్చయానికి వచ్చాడు.

"నిజమా రెడ్డీ నువ్వు జెప్పేది" నమ్మలేనట్టుగా అన్నాడు రాములు.

"గలత్ జెప్పనికి నాకేం బట్టిందన్నా! నా కండ్లతోటి జూసినా గారోజు రాత్రి పోచయ్య నిమ్మకాయలు దెచ్చి మీ ఇంటి ముంగట ఏస్తుంటె" అన్నాడు రెడ్డి.

రాములు ఆగ్రహోదగ్రుడైనాడు. అంతకు పది రోజుల క్రితమే అతని చిన్నకొడుకు ఏదో తెలియని వ్యాధి వల్ల మరణించాడు. ఏ డాక్టర్ వద్దకు వెళ్ళినా రోగం తిరగలేదు. కారణం ఇదన్నమాట.

"మొన్న పోచయ్య ఇంటికి రాలే ఒక పంతులు! ఆయన ఇసువంటియే జేస్తడంట. ఇద్దరు కల్పి జేసిన్రు ఇదంతా" అన్నాడు రెడ్డి మళ్ళీ.

"ఆ బద్మాష్ గాణ్ణి ఇప్పడే జంపేస్తా" ఆవేశంగా లేచాడు రాములు.

రెడ్డి అతణ్ణి భుజం పట్టుకుని ఆపాడు. "జర సోచాయించు రాములూ! నువ్వొక్కనివి ఆణ్ణేమైన జేస్తే, జనాలు నిన్ను అనుమానిస్తరు. ముందు ఆదు జేస్తున్న అన్నాయం అందరికీ ఎరుక జెయ్యాల! అప్పుడు ఆళ్ళే ఆని పని పడతరు" అన్నాడు.

రామన్న ఆవేశంగా "గీ సంగతి మా వోల్లకి, ఊళ్ళో అందరికి జెప్తా" అని లేచి బయటకు పోయాడు.

ఆ మర్నాడు సాయంత్రానికల్లా ఊరు అట్టుడికినట్టుడికిపోయింది. ఈ సంగతి తెలుసుకున్న ప్రతివారూ ఆగ్రహావేశాలతో ఊగిపోతున్నారు.

"రామన్న కొడుకు అన్యాయంగ జచ్చిపోయిండు".

"మా పెద్ద పోరికి వారం రోజుల నించి జరం, కండ్లు దెరుస్తలేదు"

"మా పెన్మిటి మొన్న అడ్డంబడ్డడు"

"మొన్న పట్నం బోయినప్పడు మా పాప రిచ్చా కింద పడ్డది. జరంతల జచ్చిపోతుండె."

"మా ఇంటిది మొన్న చక్కరొచ్చి పడిపోయింది"

వీటన్నిటికీ ఎవరు కారణం? ఇంకెవరు? పోచయ్యే, అతను చేస్తున్న చేతబడులే అంది ప్రజ. ప్రజకి సొంత తల లేదు. ప్రతివాడూ ఎదుటివాడు చెప్పేదానికి చిలవలూ, పలవలూ చేర్చి వ్యాప్తి చెయ్యాలని చూస్తాడే కానీ, తాను విన్నది నిజమా కాదా అన్నది విచారించడు. ఎదుటివాడు ఏం చేస్తున్నాడో చూచి తానూ అదే




## మూడు ■ పేర్ల సినిమా

మాజీ గవర్నరు, మాజీ మంత్రి కీ.శే. కోన ప్రభాకరరావు తాను హీరోగా ఓ చిత్రం తీశారు. డి.ఎస్. కోట్నీస్ దర్శకుడు. లక్ష్మీరాజ్యం నాయిక ఏం పేరు పెట్టాలి? అని ఆలోచించారు. రచయిత సదాశివ బ్రహ్మం ఒక పేరు, ప్రభాకరరావు ఒక పేరూ, దర్శకుడు ఒక పేరూ సూచించారు. ఇది బావుంటుందంటే ఇదే బావుంటుందన్నారు–ముగ్గురూ. ఏదీ తెగలేదు. ఎవరికీ మనస్తాపం, కోపం రాకుండా వుండాలని మూడుపేర్లూ పెట్టేశారు ఆ చిత్రానికి. 'మంగళసూత్రం, ఎక్స్క్యూజ్‌మీ, ఇది మా కథ'–అన్న మూడు పేర్లతోనూ ఆ సినిమా విడుదలయింది–1946లో.

## ■ ఓవల్‌టిన్ ■

'వీరపాండ్య కట్టబ్రహ్మన్' చిత్రం తెలుగులోకి అనువదింపబడుతోంది. కీ.శే. కె.వి.ఎస్. శర్మ శివాజీ గణేశన్‌కు కంఠదాత. ఒక పెద్ద డైలాగు ఒకే టేక్‌లో 'ఓకే' చేశారని, శబ్ద గ్రాహకుడు కోటేశ్వరరావు "చాలా బాగుంది" అని అభినందించారు. అప్పడు 'ఓవల్టిన్' పానీయం దిగుమతి అయి, అందుబాటులో వుండేది. "పట్టి అభినందనలకేం–ఓవల్టిన్ ఇవ్వవచ్చుగదా", అన్నారు శర్మ. కోటేశ్వరరావు ఇప్పడు ఫిలిమ్ రౌండ్ టిన్నుల్లోనే వస్తోంది. ఇంకా ఓవల్టిన్‌లలో రావడం లేదు. అంచేత, రౌండ్ టిన్ తీసుకోండి ప్రస్తుతానికి" అన్నారు నవ్వుతూ. ఆ జోక్‌కి శర్మ దగ్గర్నుంచి చుట్టూ వున్న వాళ్ళంతా గొల్లున నవ్వేశారు.

— బద్దిగం



పనిని మరింత గొప్పగా, ఉత్సాహంగా చెయ్యాలని చూస్తాడే గానీ అసలు ఆ పనే తప్పేమోనని ఆలోచించడు. కొందరు చదువుకున్న కుర్రవాళ్ళు, గ్రామస్థుల ఆవేశాన్ని ఆపాలని చూశారు కానీ, వారి పెద్దలు వారి నోళ్ళను నొక్కేశారు.

ప్రజా సమూహం ఆవేశంగా పోచయ్య ఇంటివేపు కదిలింది. పోచయ్యకు ఈ విషయం అందించారు ఎవరో అప్పుడే. అతను ఇంటి వెనుక గోడ దూకి పారిపోసాగాడు. జనం అతని వెంట పడ్డారు.

"పట్కోండ్రా! పట్కోండ్రా!"

"బాడఖావ్ గాణ్ణి ఇడ్వకుండ్రి"

"చేతబడి చేస్తాడు బద్మాష్‌గాడు"

పోచయ్య పరిగెత్తి, పరిగెత్తి అలసిపోయాడు. ఒక చోట కూలబడిపోయాడు. జనం అతణ్ణి పట్టుకొన్నారు. వారిలో దాగి వున్న పశుత్వానికి, బయటపడే అవకాశం లభించింది. దానికొక కారణం దొరికింది. ఇంకేం! ప్రతివాడూ అతని మీద తమ పశుత్వాన్ని ప్రదర్శించి హింసించారు. కర్రలతో, పిడికిళ్ళతో, చరువులతో, లెక్కలేనన్ని దెబ్బలు అతడి మీద పడ్డాయి. పోచయ్య కింద పడిపోయాడు. లేచి, శక్తి అంతా కూడగట్టుకుని అరిచాడు.

"ఆగుండ్రి! నేనేం జేసినా, గిట్ల జంపేస్తున్నరు"

"ఏంరా సాలే! తెల్వనట్లడుగుతున్నవ్‌రా! చేత బడి జేస్తలేవుర నువ్వు?"

"నేనా! ఏడ జేసినా? మీరు జూసిండ్రా?"

"చేసేటోడు చూసెటట్లు జేస్తాడ్రా గాడ్దీ! ఏం చెయ్యకుంటే మమ్ములను జూసి ఉరికిపోయిన వెందుకురా"

"....... నాకేం దెల్వదు. ఇడువుండ్రి నన్ను"

"జా. మొన్న మీ ఇంటికొచ్చిన పంతులెవడ్రా! ఆడేగాదు ఇయన్నీ సురూ జేసిందు నీ తోటి?"

"లేలే! ఆయన పట్నంల మా దోస్తుకి కాకయ్య (బాబాయి) గావాల! ఈడ ఏదో పని మీదొస్తే మా ఇంట్ల వున్నడు"

పోచయ్య ఇంకా ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ అతనికి నోటంట మాటలు పెగిలి రావడం లేదు. హఠాత్తుగా ఎదురైన ఆపద వల్ల అతను కోలుకోలేని 'షాక్'లో వున్నాడు. పెదాలు కదుల్తున్నాయి గానీ మాటలు రావడం లేదు. జరుగుతున్న దేనిటో అతనికి అర్థం కావడం లేదు.

"అదిగో! మంత్రాలు జదువుతున్నట్టున్నాడు." అన్నారెవరో.

కోటిరెడ్డి కాబోలు. అతనే. జనంలో ఎవరికైనా పోచయ్య మీద సానుభూతి కల్గుతుందేమోనని అతని భయం. అలా అయితే తన పని జరగడం కష్టం. వీలైనంత తొందరగా ఈ పని అయిపోవాలని అతని తాపత్రయం.

మంత్రాల మాట వినగానే ప్రజలలో వెర్రి ఆగ్రహం కట్టలు తెంచుకొంది. మంత్రగాడి ముందు పళ్ళు రెండూ ఊడగొడితే మరి మంత్రాలు పలకలేడని రెడ్డి వారికి నిన్ననే చెప్పాడు. జనం రాళ్ళు తీసుకు వచ్చారు. అత్యంత హృదయవిదారకమైన రీతిలో, దారుణంగా పోచయ్య ముందు పళ్ళు రెండూ ఊడగొట్టబడ్డాయి. అతని నోటి నుంచీ రక్తం వరదలుగా కారుతోంది. స్పృహ ఎప్పుడో తప్పిపోయింది. సగం చచ్చినవాడి లాగున్నాడతను. ఈ దృశ్యం చూడలేని మానవత్వం అక్కణ్ణించీ పారిపోయింది.

ఊరి జనంలో ఆలోచించగలవారూ, మంచి అనేది వున్నవారూ లేకపోలేదు. కానీ వారందరినీ 'పిరికితనం' అనే దెయ్యం ఆవహించగా బొమ్మల వలె చూస్తుండిపోయారు.

'ధైర్యం' లేని మంచితనం వ్యర్థం. దానివల్ల ప్రయోజనం ఏమీ లేదు. అదే ప్రస్తుతం మన జాతికి పట్టిన దుఃస్థితి!

డప్పుల మోత బాగా ఎక్కువైపోయింది. అది వినలేని ఆడవాళ్ళు తలుపులు వేసుకొంటున్నారు. పిల్లలు జడుసుకొని ఇళ్ళల్లోకి పారిపోతున్నారు. జనం సగం చచ్చిన పోచయ్యను కొట్టుకుంటూ, నెట్టుకుంటూ తీసుకుపోతున్నారు. మంత్రగాణ్ణి చంపేస్తే గానీ ఊరికి పట్టిన పీడ తొలగదనీ, ఆదివరకు చేసిన చేతబడులు పోవనీ నిన్న జరిగిన ప్రచారంలో బోధించబడ్డది.

ఊరు! అమాయకత్వానికి, సహజ సౌందర్యానికీ ప్రతీక.

కానీ, అజ్ఞానానికీ, అంధ విశ్వాసాలకీ కూడా ప్రతినిధి!

ఊరు! ప్రకృతి వరప్రసాదానికి మారు పేరు, అవ్యాజ ప్రేమానురాగాల పుట్టినిల్లు.

కానీ, అర్థంలేని రాజకీయాలకూ, ఆవేశ కావేషాలకూ నివాసం!

అకారణ వైరాలకు ఆటపట్టు!

ఊరు! ప్రశాంతి నిలయం.

కానీ, అందులో అంధకారం!

పోచయ్య కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. అతను నడవలేకపోతున్నాడు. కానీ, నిజానికి అతను నడవటం లేదు. ప్రజాసమూహమే అతణ్ణి ఈడ్చుకుంటూ తీసుకుపోతున్నది. అతను ఇప్పుడు ఒక ఆత్మగౌరవం కల మనిషి కాదు. ఒక జంతువు, ఒక ప్రాణి మాత్రమే! అతన్లో ప్రస్తుతం ప్రాణేచ్ఛ తప్ప మరొకటి లేదు. అందుకే అతడు దెబ్బల నించీ తప్పించుకోవాలని చూస్తున్నాడే తప్ప ఎందుకు కొడుతున్నారో అడగాలనుకోవడం లేదు. కొట్టవద్దని వేడుకొంటున్నాడే తప్ప, గౌరవంగా చూడమని అడగటం లేదు. బతుకుతానని ప్రాధేయపడుతున్నాడే తప్ప, మీతో సమానంగా బతుకుతానని వాదించడం లేదు. జనం తాము పశువులై అతణ్ణి ఒక హీనమైన జంతువుగా మార్చివేశారు.

ఊళ్ళోని కూడలిలో మండుతున్న నిప్పులగుండం ఒకటి తయారుచేయబడి వుంది. పీర్ల పండుగలప్పుడు మహమ్మదీయులు అక్కడ నిప్పులపై నడుస్తారు ప్రతిఏడూ. కానీ, ఇప్పుడు దాని ప్రయోజనం వేరు.

పోచయ్యని కొట్టుకుంటూ ఆ గుండం దగ్గరకు తీసుకువచ్చారు. కణకణ మాడుతున్న నిప్పుల్ని చూడగానే పోచయ్య పై ప్రాణాలు పైనే పోయాయి. అతన్లోని సర్వజంతు సహజమైన ప్రాణభయం విజృంభించింది. శక్తి అంతా కూడగట్టుకొని పారిపోబోయాడు. కానీ అంతలో ఎక్కణ్ణించో ఒక రాయి వచ్చి అతనికి తగిలింది. ఆ మరుక్షణంలో మరెన్నో రాళ్ళు నలువైపుల్నించీ వచ్చి తగిలాయి. రక్తం కారిపోతున్నది. పోచయ్య కింద పడిపోయాడు. ఆ పడడం చితిమీదే. కాలిపోతున్నాడు, మంటలు! మంటలు! శక్తి అంతా కూడగట్టుకొని లేచాడు. నిలదొక్కుకున్నాడు, ఒక అడుగు వేశాడు. అంతలో మళ్ళీ రాళ్ళ వర్షం! తల పగిలిపోతున్నది! రక్తం ధారలుగా కారిపోతోంది శరీరం అంతట్నుండీ. నిలబడలేకపోతున్నాడు, మళ్ళీ పడిపోయాడు. భరించలేని మంటలు! ఒళ్ళంతా కాలిపోతున్నది! తన శరీరంలో, తన జీవితంలో మిగిలిన యావచ్ఛక్తినీ మూల మూలల్నించీ లాగి కూడగట్టుకుని, మరొక్కసారి లేచాడు. రెండడుగులు వేశాడో లేదో ఒక బలమైన రాయి వచ్చి అతడి తలపై తగిలింది. స్పృహ పూర్తిగా తప్పింది, పడిపోయాడు. ఈసారి ఇక లేవలేదు.

(రెండు సంవత్సరాల క్రిందట పత్రికల్లో వచ్చిన ఒక వార్తకు చలించి)

*

## ■ హైకూలు ■

రాత్రొచ్చిన వాన
చెట్టు, చేమలకి
కొత్త రంగువేసి పోయింది

ఎవరు పారేసుకున్నారో కరెన్సీ నోటు,
పిల్లోడి చేతిలో పడనై,
వాన కాలవతో పోతోంది

విసిగిపోయిన గోలీకాయ,
తుప్పల్లో మాయమయ్యింది,
ఎంతకని వేగేది, రాలుగాయి పిల్లోడ్తో!

మైదానంలో పడేసి పడేసి,
మోకాళ్ళపై జ్ఞాపకాలొదిలి పోయింది
మాయదారి సైకిలు

— వెంకటరావు.